# మంచు కత్తులు

పి.వి.ప్రభాకరమూర్తి




మండపేటలో దమయంతి పెసరట్టు మాంచి ఫేమస్. ఆ పెసరట్టు కోసమే చుట్టుపక్కల వున్న పాలతోడు, ఇప్పనపాడు, వేములపల్లి, మోదుకూరు నుంచి కూడా కుర్రకారు సైకిళ్ళమీద ఝూమ్మని మండపేటలో వాలతారు. ఏ పనిమీద మండపేటొచ్చినా దమయంతి హోటలు ముందు ఆగకుండా ఊళ్ళు చేరరు. దమయంతి మెప్పు పొందడానికి తాపేశ్వరం నుండి వచ్చే కుర్రకారు పెద్ద పెద్ద చేపల్లాంటి కాజాల్ని బహుమతిగా ఇచ్చి సంతోషపడుతూ వుంటారు. చుట్టుపక్కల పల్లెటూళ్ళలో దమయంతి పెసరట్టును తలుచుకోందే ముసుగెయ్యరంటే నమ్మబుద్ధి కాదు కానీ అది పచ్చినిజం.

ఇనప సామాన్లమ్ముకునే సత్తిపండు రాజమండ్రి పుష్కరాల్లో దమయంతిని చూసి మనసుపడి, మూడుముళ్ళు వేసి మండపేట తీసుకొచ్చాడంటారు. ఇనపసామాన్ల కొట్లో పాతసిలెండరు పేలి సత్తిపండు చచ్చిపోయినప్పటినుంచి మరో దారి లేక కలవపువ్వు సెంటర్లో హోటలు పెట్టాలనుకుంది దమయంతి. ఇంకోవారం రోజుల్లో హోటలు పెడతానని చూచాయిగా అక్కడా ఇక్కడా అంది. అంతే చుట్టుపక్కల కుర్రకారంతా చందాలేసుకుని నాలుగు రోజులు తిరక్కుండా కలవపువ్వు సెంటర్లో దమయంతి చేత హోటలు పెట్టించేసారు. పైసా ఖర్చులేకుండా హోటలుకు యజమానురాలయిపోయింది. దమయంతి అందం ముందు ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోని ఆడోళ్ళ అందం, గులాబి పువ్వు ముందు నాచుపువ్వే. ఆ విషయం ఆళ్ళ మగోళ్ళే రహస్యంగా ఒట్టేసి ఒప్పేసుకుంటారు. దమయంతిని చూడడానికి ప్రత్యేకించి చుట్టుపక్కల ఊళ్ళ నుంచి సైకిళ్ళేసుకొచ్చే జనం కలవపువ్వు సెంటర్లో చాలామందే ఉంటారు. ఆకలేసినా వెయ్యకపోయినా దమయంతి పెసరట్టు తినేసి, చొల్లుకార్చుకుంటూ ఇక వెళ్ళకతప్పదా అన్నట్లు సైకిళ్ళెక్కే జనం రోజురోజుకి పెరిగిపోవటం మొదలెట్టారు. పెసరట్టుకి యాభై రూపాయలిచ్చి చిల్లరడగటం మానేసి సైకిలెక్కేస్తున్నారంటే పరిస్థితి తీవ్రతని అర్థం చేసుకోవచ్చు.

సరిగ్గా ఆ టైములోనే మోదుకూరు నుండి రోజూ మండపేట వచ్చే వీర్రాజు కంట్లో పడింది దమయంతి. దమయంతికి వీర్రాజు, నలమహారాజులా కనిపించాడు. మోదుకూరు చుట్టుపక్కల ఏభై ఎకరాలకు ఆసామి వీర్రాజు. బ్రహ్మచారయిన వీర్రాజుకి ఆడదంటే కొత్తేమీ కాదు. పులికి లేడి ఎలాగో, వీర్రాజుకి లేడీ అలాగన్న మాట. పైగా అదే అతగాడి వీక్‌నెస్. దమయంతి నెయ్యితో వేసిన పెసరట్లతో వీర్రాజుని ఆకట్టేసుకుంది. అంతకంటే ఎక్కువ అతని ఆస్తిమీద ప్రేమెక్కువయింది. పెసరట్టు చుట్టూ నెయ్యి వేసినట్టుగా, వీర్రాజుచుట్టూ ప్రేమ ఒలకబొయ్యసాగింది.

వీర్రాజు, దమయంతిని మొదటిచూపులోనే మనసులో అట్టేపెట్టేసుకున్నాడు. వీర్రాజు మనసుపొరల్లో దమయంతి, పూతరేకుల మధ్యలో పంచదారలా అయిపోయింది. పాతికేళ్ళన్నప్పటి నుండి మండపేటంతా మరాడించేసిన వీర్రాజుకి, దమయంతి అందం అప్పుడే అచ్చోసిన పంచదార చిలకలా అనిపించింది. దమయంతి అందమంతా బుగ్గనపడే సొట్టలోనే ఉందంటాడు వీర్రాజు. కాదుకాదు ఆమె నడుము, కోటిపల్లితీర్థంలో మేకుకి తగిలించి సాగదీసే జీడిలా వుంటుంది అంటుంది అతగాడి మనసు. ఓ మంచి ముహూర్తంలో "మనం పెళ్ళి చేసుకుందాం" మనసులోమాట బయటపెట్టాడు వీర్రాజు చుట్ట నవుల్తూ.

"ఆలోచించుకోవడానికి నాలుగు రోజులు టైమిస్తావా, అదీ లేదా!" ప్లేట్లో మరో పెసరట్టు వడ్డిస్తూ హాస్యమాడింది దమయంతి.

నిజానికి వీర్రాజుకంటే దమయంతి పాతికేళ్ళ చిన్నది. ఆమె ఇష్టపడింది అతని ఆస్తిని చూసి కానీ తనతో కాపురం వెలగబెడదామని కాదు. ఆ విషయం వీర్రాజుకి తెలియకపోయినా దమయంతికి బాగా తెలుసు. ఈడికున్న షుగరు, బిపిలతో ఎప్పుడో పడవ ముంచేస్తాడు. పైగా ఈడికి ముందువెనకా ఎవరూ లేరు అన్న కోణంలోంచి కూడా దయమంతి ఆలోచిస్తోంది. వీర్రాజు ఎంత మంచోడో అంతకు పదిరెట్లు చెడ్డోడు కూడా. రెండేళ్ళక్రితం పరాచకాలాడాదని ఇంటింటికి పేపర్లేసే సత్తిపండుని పనస పండు కోసేసినట్లు కోసేసాడు. అప్పుతీసుకుని నామం పెట్టాడని చిన్నబజార్లో చింతపండు అమ్ముకునే జగ్గారావు కుడికాలు జాయింట్లు తీసేసి కుంటోడిని చేసేసాడంటారు. అందుకే వీర్రాజు లైన్లోకొచ్చేసరికి కలవపువ్వు సెంటర్లో కుర్రకారంతా బిక్కమొహాలేసుకుని పాతసినిమా పోస్టర్ని చూసినట్లు దమయంతిని చూడటం తప్ప ముందుకెళ్ళలేకపోయారు.


ఓ మంచి ముహూర్తం చూసి దమయంతిని చిన్న తిరుపతి గుడిలో పెళ్ళి చేసుకున్నాడు వీర్రాజు.

పెళ్ళిచేయాలి అని పంతులుగారిని అడిగినప్పుడు, "పెళ్ళికొడుకేడీ" అన్నందుకు పంతులుగారిని తిట్టని తిట్టు తిట్టకుండా తిట్టాడు. ఆయనే మండపేటలో ఉండుంటే ఆ మాటన్నందుకు నాలిక బయటికిలాగి కోసేసుండేవాడు. పంతులుగారు మారు మాటాడకుండా పెళ్ళికానిచ్చేసాడు. అక్కడక్కడా తెల్లవెంట్రుకలున్న దమయంతికి, అక్కడక్కడా నల్లవెంట్రుకలున్న వీర్రా

జుకి పెళ్ళి జరుగుతుంటే గుడిమండపంలో జనం గుసగుసలాడుకోవడం దమయంతి చెవిన పడకపోలేదు.

ప్రయాణం మధ్యలో కొవ్వూరులో షుగరు డౌనయిపోయి కిందపడిపోయిన వీర్రాజుని రాజమండ్రి హాస్పిటల్లో జేర్చింది దమయంతి. "షుగరు ఐదొందలు దాటింది. జాగ్రత్తగా పత్యం అదీ చెయ్యాలి. అడ్డమయిన గడ్డీ తిన్నావంటే శాల్తీ లేచిపోతుంది. జాగ్రత్తగా ఉండు. ఫీజు రెండు వేలు కౌంటరులో కట్టు" డాక్టరు గట్టిగా చెప్పాడు. చెప్పినవాడు డాక్టరా, విలనా అర్థమవలేదు దమయంతికి. అలాగే అని తలూపి, వీర్రాజు పర్సులోంచి రెండు పెద్దనోట్లు తీసి, కౌంటరులో ఉన్న అమ్మాయిచేతిలో పెట్టి వీర్రాజుతో మండపేట ప్రయాణమయింది.

ఇంటికెళ్ళాక కొన్ని రోజులకి దమయంతిని నిలువునా బంగారంతో ముంచేసాడు వీర్రాజు. నగలు పెట్టుకుని అద్దంముందు అరగంటసేపు సెంటర్లో నెహ్రూగారి విగ్రహంలా నిలబడిపోయింది. నగలమధ్యలో వున్న దమయంతిని కనుక్కోవడం వీర్రాజుకి చాలాసేపు పట్టింది.




వీర్రాజు దమయంతిని పువ్వుల్లోపెట్టి చూసుకుంటున్నాడు. ఓ రోజు ఆలమూరునుంచి పెదపూడి జనార్ధనమూర్తి అనే ప్లీడర్ని తీసుకొచ్చి ఆస్తినంతా దమయంతి పేర్న రాసేసాడు. కాయితాల్ని ఆప్యాయంగా తీసుకున్న దమయంతి డబ్బొస్తుందనుకుంది కానీ, ఇంత త్వరగా ఇంత పెద్ద డబ్బు చేస్తుందనుకోలేదు. ఓరోజు మధ్యాహ్నం పూట భోజనం చేసి, దొడ్లో విశ్రాంతి తీసుకుంటున్న వీర్రాజు నెత్తిమీద కొబ్బరి గెలపడి మంచంమీదే పోయాడు. వీర్రాజు పోయాడని దమయంతి బాధపడింది కానీ కృంగి, కృశించి, నశించిపోలేదు. ఎందుకయినా మంచిదని నగలన్నీ బ్యాంకు లాకర్లో పడేసింది.

అప్పుడొచ్చారు ఎక్కడాలేని అప్పులాళ్ళు. వీర్రాజుకి అన్ని అప్పులున్నాయని విని ఆశ్చర్యపోయింది ఒక్క దమయంతే కాదు, సొంతూరయిన మోదుకూరూ ఆశ్చర్యపోయింది. "ముదనష్టపు సచ్చినాడు, ఇన్ని అప్పులెట్టుకుని నాకెందుకీ ఆస్తి రాశాడో" అర్థమవక వీర్రాజుని తిట్టుకుంది దమయంతి. వచ్చిందే కట్నం అన్నట్లుగా అప్పులోళ్ళంతా అరగజం కూడా వదలకుండా ఆస్తంతా పట్టుకుపోయారు. నెల తిరిగేసరికి కలవపువ్వు సెంటర్లోదమయంతి మిరపకాయబజ్జీలు వేయడం మొదలుపెట్టింది. పెసరట్టేసిన చోటే బజ్జీలేయడమంటే ఇదేనేమో అనుకున్నారంతా. అంతవరకూ ఖాళీగా వున్న కుర్రాళ్ళంతా మళ్ళీ బిజీ అయిపోయారు.

ఓ సాయంత్రం పూట పెదపళ్ళనుంచి రాజశ్రీ కలవపువ్వు సెంటర్లోదిగి అటూఇటూ చూసి దమయంతి బజ్జీలబండి దగ్గరకి వచ్చి, వీర్రాజు గురించి వాకబుచేయడం మొదలుపెట్టింది. పెదపళ్ళలో రోల్డుగోల్డు వ్యాపారంపెట్టి, నాటకాలవాళ్ళకి రోల్డుగోల్డు నగలు సప్లయి చేసి బాగానే గడించింది. రెండునెలల క్రితం పౌరాణిక సినిమా తీస్తున్నానని నగలు తీసుకున్న వీర్రాజు అయిపుమచ్చ లేకపోతే మండపేటొచ్చింది రాజశ్రీ. నిజానికి అసలా వ్యాపారం పెట్టించింది వీర్రాజే. పెళ్ళయిన మొదటిరాత్రి మంచంమీద బోర్లా పడుకుని రాజశ్రీతో రాజమండ్రి మెయిన్‌రోడ్డులో బంగారం కొట్టు పెట్టిస్తానన్నోడు, పెళ్ళిచేసుకున్నాక పెదపళ్ళలో రోల్డుగోల్డు వ్యాపారం పెట్టించాడు. రోడ్డుమీద పడి సవరాలు అమ్ముకోవడంకన్నా ఇది బానేవుందని సరిపెట్టుకుంది రాజశ్రీ. దమయంతిని చూడగానే ఇట్టే గుర్తుపట్టేసిన రాజశ్రీ బండిముందున్న చెక్కబల్లమీద కూర్చుని

గతాన్ని తవ్వడం మొదలెట్టింది. "మీ అమ్మ పోయిన తర్వాత నువ్వు రాజమండ్రిలో మళ్ళీ కనబడలేదు కానీ, సవరాలు ఎంత గిరాకి అయిపోయాయనుకున్నావు. రెండొందలు పెడితేకాని జానాబెత్తెడు సవరం రావటం లేదు. జుట్టు మరీ ప్రియం అయిపోయిందనుకో. వీర్రాజుబావ నామీద మనసు పారేసుకోబట్టి నా బతుకు ఇలా మీటరు పొడవు సవరంలా ఉందికానీ, లేకపోతే బతుకంతా జానాబెత్తెడు సవరమే అనుకో"




రాజశ్రీ సవరం భాష మాట్లాడుతున్నంత సేపూ చుట్టుపక్కల ఎవరయినా వింటారేమో అని తెగ ఇదయిపోయింది దమయంతి. రాజశ్రీ తనూ చిన్నతనంలో రాజమండ్రి సీతంపేట, ఆర్యాపురం, తుమ్మలావ వీధుల్లో తిరిగి సవరాలు, జుట్టు అమ్మడం, కొనడం వ్యాపారం చేసామని మండపేట కుర్రోళ్ళకి తెలిస్తే పరువుపోదూ? ఎంత త్వరగా రాజశ్రీని పంపించేస్తే తనకి అంత మంచిదని నిర్ణయించేసుకుంది దమయంతి. పైగా ఇది నిమిషానికోసారి వీర్రాజుబావ, వీర్రాజుబావ అంటోంది. చచ్చి ఎక్కడున్నాడోకానీ వీర్రాజుగాడు చాలామందినే పట్టేసాడు. పళ్ళుకొరికింది దమయంతి. దీన్ని ఇంకా ఇక్కడే వుంచితే 'బంగారం, వాటా' అంటుంది. దీన్ని దూరం పంపేయాలని దృఢంగా అనుకుంది.

"అక్కా! వీర్రాజుబావ నిన్ననే గౌతమీలో హైదరాబాదు వెళ్ళిపోయాడు. ఇంక మండపేట రానని చెప్పాడు. ఒకవేళ రాజశ్రీ వస్తే నాగారం సెంటర్లో చుట్టకాలుస్తూ నిలబడుంటానని చెప్పు అన్నాడు. నువ్వు సాయంత్రం గౌతమీలో హైదరాబాదు వెళ్ళిపోడం మంచిది. లేకుంటే నాగారంలో నగారా మోగించేస్తాడు మనోడు" అని ఆ సాయంత్రం రాజశ్రీని రాజమండ్రి తీసుకెళ్ళి గౌతమీ ఎక్కించేసి, చేతిలో మిరపకాయబజ్జీల పొట్లాం పెట్టి "వీర్రాజుబావ గుర్తొచ్చినప్పుడల్లా తింటూ వుండు" అని చెప్పి వచ్చింది దమయంతి.

రాజశ్రీ వచ్చి బంగారంలో వాటా అడుగుతుందన్న భయంతో మండపేట బ్యాంకులాకర్లోంచి బంగారం కాని బంగారాన్ని తీసి మూటగట్టుకుని, ఎవరికీ తెలియకుండా ఆ రాత్రే కోనసీమవైపు వెళ్ళిపోయిన దమయంతి ఇప్పటివరకు ఎవరికీ తారసపడలేదు.

✻



## అదండీ సంగతి!

రాబోయే 'లఫంగే-పరిందే' అనే సినిమాలో దీపికా పదుకొనె ఓ ముద్దు సీన్ చేస్తోంది. ఇందులో ఏముంది, ఇప్పుడు చాలామంది హీరోయిన్లు చేస్తున్నదే కదా అనవచ్చు. కానీ హీరో నీల్ నితిన్ ముఖేష్ ఇలా దీపికతో ముద్దు సీన్ చేయడమే ఇక్కడ విశేషం. గతంలో రిమీసేన్, ముగ్ధా గాడ్సేలతో ముద్దుసీన్లు చేయడానికి నిరాకరించిన నితిన్ ఇప్పుడు దీపికతోనూ చేయనన్నాడట. కానీ ఈ సీన్ సినిమాకి చాలా అవసరం అని డైరెక్టర్ నచ్చ చెప్పడంతో ఒప్పుకున్నాట్ట. దీపిక మాత్రం ఎలాంటి అభ్యంతరాలూ చెప్పలేదని సినీజనాల ఉవాచ.